RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 107 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజిలు : 4 వెల రూ. 2 శుక్రవారం -28 - ఆగష్టు - 2026

published From :Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు: విదేశాంగ శాఖ

### తమిళనాడుకు చెందిన 21 మందిని సురక్షితంగా కాపాడిన అధికారులు

టిబెట్‌లోనూ 200 మంది భారతీయుల సహాయ అభ్యర్థన

నేపాల్ అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు

2లో

## భారత్ నెత్తిన చైనా 'నీటి బాంబ్'.. జాగ్రత్తగా లేకుంటే ఉత్పాతమే!



2లో

- 60,000 మెగావాట్ల మెడోగ్ డ్యామ్ నిర్మిస్తున్న చైనా
- భూకంప ప్రాంతంలో డ్యామ్ నిర్మాణంపై ఆందోళన
- డ్యామ్‌ను 'వాటర్ బాంబ్'గా నిపుణులు అభివర్ణన
- నీటి విడుదలతో ఈశాన్య భారత్‌కు వరద ముప్పు
- సియాంగ్‌పై భారత్ 11,000 మెగావాట్ల ప్రాజెక్టు

## మంగళగిరిలో మోడరన్ రైతు బజార్..

# శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

- రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం
- అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం
- రిటైల్, హోల్ సేల్ స్టాళ్లు, కోల్డ్ స్టోరేజీతో కూడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్



అమరావతి: మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు మిగతా 2 లో



2లో

## అనకాపల్లి పంచధారల కొండలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం: 'నో మైనింగ్ జోన్'గా ప్రకటన

మైనింగ్ వల్ల పంచధారల కొండకు ముప్పు

వాటిల్లుతోందంటూ పెద్ద ఎత్తున అభ్యంతరాలు

పురాతన క్షేత్రమైన శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి దేవాలయం దెబ్బతింటుందని ఆందోళన

## రాష్ట్రవ్యాప్త విస్తరణకు

# 90 రోజుల ప్రణాళిక

### జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

- ★ 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తాం
- ★ ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయాలి
- ★ వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా అమలు: చంద్రబాబు
- ★ సంజీవని ప్రాజెక్టుపై మంత్రి సత్యకుమార్, ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతి: రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్య, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని.. ఈ వ్యయాన్ని తగ్గించేందుకే సంజీవని లాంటి కార్యక్రమాలు తీసుకొస్తున్నట్లు మిగతా 2 లో

## అమరావతి అసెంబ్లీ భవన నిర్మాణంపై ఉన్నతస్థాయి సమీక్ష

### .. అధికారులకు స్పీకర్ కీలక ఆదేశాలు

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని స్పీకర్ ఆదేశం
- 265 మంది ఎమ్మెల్యేలు, 110 మంది ఎమ్మెల్సీల కోసం ఏర్పాట్లు
- నార్మన్ ఫోస్టర్ సంస్థ ప్రతినిధులతో అధికారుల భేటీ
- ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న మంత్రి మనోహర్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శాసనసభ భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని మిగతా 2 లో



2లో

## ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత: సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం.. అడ్డుకున్న తెలంగాణ అధికారులు

నాగార్జునసాగర్ కుడికాల్వ గేట్లు తెరిచేందుకు ఏపీ అధికారుల ప్రయత్నం

బోర్డు అనుమతి లేదంటూ అడ్డుకున్న తెలంగాణ ఇంజనీర్లు

విద్యుదుత్పత్తి ద్వారా 2,000 క్యూసెక్కులు విడుదల చేసిన ఏపీ

దీనికి ప్రతిగా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసిన తెలంగాణ

## 'రాహుల్.. ఢిల్లీకి ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా?'

### తెలంగాణ విద్యార్థుల సమస్యలు రేవంత్‌కు పట్టవా?

- పాలిటెక్నిక్ విద్యార్థులపై రేవంత్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తోంది
- పాలిటెక్నిక్ విద్యార్థులేమన్నా టెర్రరిస్టులా?
- రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండడం మా దౌర్భాగ్యం





వరంగల్: పాలిటెక్నిక్ విద్యార్థులపై రేవంత్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని మిగతా 2 లో

## పెట్టుబడులను ఆకర్షించేలా

# 'ఇన్వెస్ట్ తెలంగాణ'

### "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ

- ఇన్వెస్ట్ తెలంగాణ' నిర్వహణకు వార్‌రూం
- సమిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్‌రూంను ఏర్పాటు చేయాలి
- పెట్టుబడులను ఆకర్షించేలా ప్రచారం
- సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్‌రూం పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పర్యవేక్షించాలి



హైదరాబాద్: పెట్టుబడులను ఆకర్షించేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ' నిర్వహణకు నిపుణులతో కమిటీల ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మిగతా 2 లో

## మీరాలం చెరువు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్

- క్రేన్‌పైకి ఎక్కి పనులను చూసిన సీఎం రేవంత్ రెడ్డి
- సస్పెన్షన్ బ్రిడ్జి పనులను క్రేన్‌పై నుంచి పర్యవేక్షించిన ముఖ్యమంత్రి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



హైదరాబాద్: హైదరాబాద్‌లోని మీరాలం చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. మిగతా 2 లో





2లో

## ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు పత్రాలిస్తే కఠిన చర్యలని హెచ్చరిక

తెలంగాణ ఓటర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హెచ్చరిక

రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ

తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష తప్పదని స్పష్టం

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# రాష్ట్రవ్యాప్త విస్తరణకు 90 రోజుల ప్రణాళిక

అమరావతి: రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్య, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని.. ఈ వ్యయాన్ని తగ్గించేందుకే సంజీవని లాంటి కార్యక్రమాలు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు నిర్దేశించిన 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. 'కుప్పం నియోజకవర్గం సహా చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి. దీన్ని రాష్ట్రమంతా అమలు చేయాలి. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయాలి. ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలి' అని సీఎం పేర్కొన్నారు.

సమర్థ సేవలందించని వారిని తొలగించే విధానం

ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్‌సోర్సింగ్ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సమర్థంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలగించేలా ఒక విధానం తీసుకురావాలి' అని ఆదేశించారు.

రాష్ట్రవ్యాప్త విస్తరణకు 90 రోజుల ప్రణాళిక

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం ప్రయోగాత్మక అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు అధికారులు చెప్పారు. 'సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేశాం. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తాం. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం.. హైపర్‌టెన్షన్ కేసుల్లో 56% కేసులు నియంత్రణలోకి వచ్చినట్లు తేలింది. డయాబెటిస్ కేసుల్లో 16% తీవ్రత తగ్గాయి. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు చేపట్టిన సర్వేలో 91% మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు' అని సీఎంకు వివరించారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజల సెల్‌ఫోన్లకు హెల్త్ అప్డేట్స్

ప్రజల్లో విశ్వాసం పెంచేలా వైద్య సేవలు అందించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. 'ప్రజల సెల్‌ఫోన్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి. ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ విస్తృతంగా వినియోగంలోకి తేవాలి. రోగుల సమాచారం భద్రపరచాలి. డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి' అని సూచించారు.

## నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు: విదేశాంగ శాఖ

ఢిల్లీ: పొరుగు దేశం నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) గురువారం వెల్లడించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ, సహాయక చర్యల నిమిత్తం నేపాల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటివరకు 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపారు. బాధితులంతా తమిళనాడుకు చెందిన వారని ఆయన స్పష్టం చేశారు. గల్లంతైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా, టిబెట్‌లో చిక్కుకున్న సుమారు 200 మంది భారతీయులు సైతం సహాయం కోసం విజ్ఞప్తి చేసినట్లు జైస్వాల్ వెల్లడించారు. వారిని సురక్షితంగా తరలించేందుకు అవసరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గల్లంతైన వారి గురించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## భారత్ నెత్తిన చైనా 'నీటి బాంబ్'.. జాగ్రత్తగా లేకుంటే ఉత్పాతమే!

ఢిల్లీ: నేపాల్‌ను ఒక్కసారిగా ముంచెత్తిన వరదలు భారత్‌లోనూ ఆందోళన రేకెత్తిస్తున్నాయి. హిమాలయ ప్రాంతంలో చోటుచేసుకున్న విపత్తు నేపథ్యంలో చైనా నిర్మిస్తున్న భారీ మెడోగ్ డ్యామ్‌పై నిపుణులు హెచ్చరిస్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌కు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై ఈ ప్రాజెక్టును చైనా చేపడుతోంది.

60 వేల మెగావాట్ల భారీ ప్రాజెక్టు

చైనా నిర్మిస్తున్న 'మెడోగ్ డ్యామ్' పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుగా నిలవనుంది. సుమారు 60,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం దీని సొంతం. బ్రహ్మపుత్రగా మారే 'యార్లుంగ్ త్సాంగ్‌పో' నది భారీ మలుపు తిరిగే ప్రాంతంలో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టు 2033 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని చైనా భావిస్తోంది.

భారత్‌కు ఎందుకు ముప్పు?

'యార్లుంగ్ త్సాంగ్‌పో' నదిపైనే చైనా 60,000 మెగావాట్ల 'మెడోగ్ డ్యామ్' నిర్మిస్తోంది. ఈ నది అరుణాచల్‌లో 'సియాంగ్'గా మారి.. తర్వాత బ్రహ్మపుత్రగా అసోంలో ప్రవహిస్తుంది. భూకంపాలకు అత్యంత సున్నితమైన ప్రాంతంలో భారీ డ్యామ్ నిర్మిస్తుండటంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చైనా భూవిజ్ఞాన శాస్త్రవేత్తల అధ్యయనంలోనూ డ్యామ్ ప్రాంతం కింద యాక్టివ్ ఫాల్ట్ ఉన్నట్లు వెల్లడైంది.

'వాటర్ బాంబ్'గా నిపుణుల హెచ్చరిక

డ్యామ్ పూర్తయితే నీటి ప్రవాహంపై చైనాకు గణనీయమైన నియంత్రణ లభించే అవకాశం ఉంది. భారీ వర్షాల సమయంలో ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే అరుణాచల్, అసోంపై వరద ముప్పు పెరగొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యామ్ నిర్మాణంతో భారత్ ఈశాన్య ప్రాంతానికి పెద్ద ముప్పు పొంచి ఉందని మాజీ రాయబారి రాజీవ్ డోగ్రా సహా పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ సియాంగ్ నదిపై 11,000 మెగావాట్ల భారీ ప్రాజెక్టును చేపడుతోంది. ఇది నీటి ప్రవాహాన్ని నియంత్రించడంతో పాటు వరద ముప్పును కొంత తగ్గించేందుకు ఉపయోగపడొచ్చు.

## అనకాపల్లి పంచధారల కొండలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం: 'నో మైనింగ్ జోన్'గా ప్రకటన

అమరావతి: పర్యావరణ పరిరక్షణ, చారిత్రక సంపద రక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది. అనకాపల్లి జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పంచధారల కొండల ప్రాంతాన్ని అధికారికంగా 'నో మైనింగ్ జోన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కొండల పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు, క్వారీ పనులకు ఆస్కారం లేకుండా పూర్తి నిషేధం అమలులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాల వల్ల జీవవైవిధ్యంతో పాటు ప్రసిద్ధ పురాతన క్షేత్రమైన శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి దేవాలయానికి, అక్కడి సహజ సిద్ధమైన పుణ్యతీర్థ జలధారలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణకు ఆదేశించింది. తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా చారిత్రక కట్టడాలకు హాని జరుగుతోందని నిర్ధారించిన అధికారులు మైనింగ్ పనులను అడ్డుకున్నారు. ప్రకృతి వనరులను కాపాడడంలో భాగంగా ఆ ప్రాంతంలో గతంలో మంజూరు చేసిన సుమారు 2.153 హెక్టార్ల క్వారీ లీజు అనుమతులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. కొండల సహజ రూపురేఖలు, జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ సంచలన నిర్ణయం పట్ల స్థానిక భక్తులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత: సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం.. అడ్డుకున్న తెలంగాణ అధికారులు

హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదం రాజుకుంది. సాగర్ కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని తీసుకునేందుకు ఏపీ అధికారులు చేసిన ప్రయత్నాన్ని తెలంగాణ ఇంజనీర్లు అడ్డుకున్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే గేట్లు ఎలా తెరుస్తారంటూ అడ్డుకోవడంతో ఇరు రాష్ట్రాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బుధవారం ఉదయం 11:10 గంటల సమయంలో ఏపీ జలవనరుల శాఖ అధికారులు నాగార్జునసాగర్ కుడికాల్వ గేట్లను ఎత్తేందుకు ప్రయత్నించారు. తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసమే నీటిని విడుదల చేసుకుంటున్నామని వారు వాదించారు. అయితే, కృష్ణా బోర్డు అనుమతి లేకుండా గేట్లు తెరవడానికి వీల్లేదని తెలంగాణ ఇంజనీర్లు స్పష్టం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. గేట్లు ఎత్తడం సాధ్యం కాకపోవడంతో ఏపీ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. ప్రస్తుతం సాగర్‌లో 535 అడుగుల నీటిమట్టం ఉండటంతో, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని ప్రారంభించి దాని ద్వారా 2,000 క్యూసెక్కుల నీటిని తమ కాల్వకు విడుదల చేసింది. దీనికి ప్రతిగా తెలంగాణ కూడా వెంటనే స్పందించి, సాగర్ ఎడమ కాల్వ గేట్లు ఎత్తి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. వాస్తవానికి, ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ఇటీవలి బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో నీటి విడుదలపై బోర్డు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఏపీ ఏకపక్షంగా నీటిని తీసుకోవడంపై తెలంగాణ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై గురువారం కృష్ణా బోర్డుకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. గతంలో 2023 నవంబర్‌లో కూడా ఇదే తరహా వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం గమనార్హం.

## ఓటర్ల జాబితా సవరణ: ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

హైదరాబాద్: తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

## యూపీఐకి 10 ఏళ్లు.. మోదీకి చంద్రబాబు అభినందనలు



అమరావతి: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వ్యవస్థ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. భారతదేశ డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ ఒక అద్భుతమైన మైలురాయి అని, సామాన్యుడి జీవితంలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీ చేసిన పోస్టుకు స్పందిస్తూ చంద్రబాబు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారూ, మీరు చెప్పింది అక్షర సత్యం. నా వ్యక్తిగత అనుభవం ద్వారా చెబుతున్నాను.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ప్రజల ఆర్థిక లావాదేవీల స్వరూపాన్ని యూపీఐ సమూలంగా మార్చివేసింది. వీధి వ్యాపారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి జీవితంలో ఇది భాగమైపోయింది. దైనందిన లావాదేవీలను ఇది ఎంతో సులభతరం చేసింది. ప్రపంచానికి భారత సాంకేతిక సత్తాను చాటిచెప్పిన ఈ మైలురాయిని చేరుకున్న సందర్భంగా ప్రతి భారతీయుడికి అభినందనలు" అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతకుముందు, యూపీఐ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ పోస్ట్ చేశారు. "భారత డిజిటల్ చెల్లింపుల ప్రయాణంలో యూపీఐ ఒక కీలక మలుపు. దీని విస్తృతి, స్థాయి ప్రతి భారతీయుడికి గర్వకారణం" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.

## పెట్టుబడులను ఆకర్షించేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ'

హైదరాబాద్: పెట్టుబడులను ఆకర్షించేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ' నిర్వహణకు నిపుణులతో కమిటీల ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజాభవన్‌లో భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) సంజయ్‌జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో వచ్చే డిసెంబరులో నిర్వహించే సదస్సు కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్‌షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలి. సమిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్‌రూంను ఏర్పాటు చేయాలి. అతిథులకు ఆహ్వానపత్రాలను త్వరగా పంపాలి" అని అధికారులను భట్టి ఆదేశించారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో వార్‌రూం పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పర్యవేక్షించాలని మంత్రులు సూచించారు. గతంలో గ్లోబల్ సమిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. సమిట్ పనుల పురోగతిపై సీఎస్ రోజుకు కనీసం ఒక గంట కేటాయించి సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టంచేశారు.

## 'రాహుల్.. ఢిల్లీకి ఒక నీతి.. తెలంగాణకు మరో నీతా?'



వరంగల్: పాలిటెక్నిక్ విద్యార్థులపై రేవంత్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని మండిపడ్డారు. పాలిటెక్నిక్ విద్యార్థులేమన్నా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారాయన. తెలంగాణ విద్యార్థుల సమస్యలు రేవంత్‌కు పట్టవా?అని నిలదీశారు హరీశ్‌రావు. 'విద్యార్థులు వారి భవిష్యత్తు కోసం పోరాటం చేస్తుంటే వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉండడం మా దౌర్భాగ్యం అంటున్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నావ్. తెలంగాణ విద్యార్థులు నీ కంటికి కనిపించడం లేదా...?, జెన్ జీ అంటూ డిల్లీలో ధర్నాలు చేస్తున్న రాహుల్ గాంధీకి ఈ పాలిటెక్నిక్ విద్యార్థులు కనిపించడం లేదా?, జెన్ జీ రోడ్డెక్కి పోరాడుతుంటే ఎందుకు స్పందించడం లేదు. డిల్లీకి ఒకనీతి.. తెలంగాణకు మరో నీతా రాహుల్ గాంధీ. రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి విద్యారుల కోసం పోరాడాలి. డిల్లీ తరహాలో విద్యార్థులు తిరగడబడక ముందే.... డిల్లీ తరహా ఉద్యమాలు జరగక ముందే... రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు' అని హెచ్చరించారు.

## మీరాలం చెరువు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్



హైదరాబాద్: హైదరాబాద్‌లోని మీరాలం చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. పనుల తీరును పరిశీలించేందుకు భారీ క్రేన్‌పైకి ఎక్కి మరీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం గమనార్హం. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. చెరువులోకి ఎలాంటి పరిస్థితుల్లోనూ మురుగునీరు వచ్చి చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మీరాలం నుంచి మూసీలోకి వరద నీరు సులభంగా వెళ్లేలా నాలాను విస్తరించాలని కూడా సూచించారు. చెరువులో ఉన్న ఐల్యాండ్‌ను అభివృద్ధి చేయాలని, వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేందుకు వీలుగా డిజైన్ రూపొందించాలని తెలిపారు. మొత్తంమీద మీరాలం చెరువును ఒక ప్రధాన పర్యాటక ఆకర్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## అమరావతి అసెంబ్లీ భవన నిర్మాణంపై ఉన్నతస్థాయి సమీక్ష .. అధికారులకు స్పీకర్ కీలక ఆదేశాలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శాసనసభ భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని రెండో బ్లాక్‌లో భవన నిర్మాణ ప్రణాళికలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ సహా ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. ఐకానిక్ భవనాల రూపకల్పన బాధ్యత వహించిన ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ 'నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్' ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొని డిజైన్లను వివరించారు. ఇంటీరియర్ డిజైన్, సభ్యుల సీటింగ్ సామర్థ్యం, అత్యాధునిక డిజిటల్ సాంకేతికత, భద్రతా వ్యవస్థలు, పార్కింగ్, సందర్శకుల సౌకర్యాలపై ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించారు. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం పెరగనున్న సభ్యుల సంఖ్యకు అనుగుణంగా 265 మంది ఎమ్మెల్యేలు, 110 మంది ఎమ్మెల్సీలు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు చేయనున్నారు. ఉభయ సభల సంయుక్త సమావేశాల నిర్వహణ కోసం విశాలమైన సెంట్రల్ హాల్‌తో పాటు, సందర్శకులకు అసెంబ్లీ విశిష్టతను వివరించేలా 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు, భవనం వద్ద అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సౌకర్యం కల్పించి, దానిపై ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయనున్నారు. సమీక్ష అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక



హైదరాబాద్: వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్ మధ్య కీలక ఒప్పందం



అమరావతి: అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ప్రముఖ సాంకేతిక సంస్థ 'ఆక్టేవ్' మధ్య రెండేళ్ల కాలపరిమితితో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి వేగంగా ఎదుగుతున్న ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆచరణాత్మక శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్ సంస్థకు చెందిన నిపుణులైన మెంటార్లతో కలిసి విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులోనూ ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటార్లు భాగస్వాములుగా ఉంటూ, మూడు నెలల నిర్ణీత వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనివల్ల విద్యార్థులకు రియల్-టైమ్ అనుభవం నేరుగా లభించనుంది. అంతేకాకుండా, మార్కెట్ అవసరాలకు తగినట్లుగా వీఐటీ-ఏపీలో ఏఐ, ఎంఎల్ పాఠ్యాంశాల రూపకల్పనకు ఆక్టేవ్ సంస్థ తగిన సూచనలు, సలహాలు అందించనుంది. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్‌లు నిర్వహించడంతో పాటు, వారికి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల కల్పనలోనూ ఇరు సంస్థలు సంయుక్తంగా వ్యవహరించనున్నాయి. సాంకేతిక రంగానికి అవసరమైన ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయ నిర్వాహకులు వెల్లడించారు.

## పార్లమెంట్‌ను నవ్వులపాలు చేస్తున్నారు డీలిమిటేషన్, 'ఒకే దేశం-ఒకే ఎన్నికల'పై చిదంబరం ధ్వజం



ఢిల్లీ: పార్లమెంట్ పనితీరు, కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు చిదంబరం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వర్షాకాల సమావేశాల్లో సరైన చర్చలు లేకుండానే బిల్లులను ఆమోదించుకున్నారని ఆయన ఆరోపించారు. రోజురోజుకూ పార్లమెంట్‌ను గేలి చేస్తూ, నవ్వులపాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు అసెంబ్లీలో జరుగుతున్న చర్చలను చూస్తుంటే.. ఎంపీగా ఉండటం కన్నా ఎమ్మెల్యేగా ఉండటమే మేలనిపిస్తోందని వ్యాఖ్యానించారు. తమిళనాడు అసెంబ్లీలో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణలను ప్రస్తావిస్తూ కేంద్రంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సామాజిక సేవ చేసే క్రైస్తవ, ముస్లిం సంస్థలను లక్ష్యంగా చేసుకుని... వారి నిధులు, ఆస్తులను లాక్కునేందుకే ఈ చట్ట సవరణను తీసుకొస్తున్నారని విమర్శించారు. ఒక ప్రభుత్వం ఈ రకంగా ప్రజల లేదా సంస్థల ఆస్తులను దోచుకోకూడదని, ఇది అత్యంత దారుణమైన చట్టాలలో ఒకటిగా నిలుస్తుందని మండిపడ్డారు. అలాగే జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ అన్యాయమైన చర్యను దక్షిణాది రాష్ట్రాల పార్టీలతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్ పార్టీలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 'ఒకే దేశం - ఒకే ఎన్నికలు' ప్రతిపాదన భారత రాజ్యాంగ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని, ఇది ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానాన్ని పూర్తిగా చిన్నాభిన్నం చేస్తుందని వ్యాఖ్యానించారు.

## భారత్-నేపాల్‌కు ఉమ్మడి ముప్పు.. పర్యావరణంపై నేపాల్ మంత్రి కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: "హిమాలయాల్లో మంచు కరిగితే అది నేరుగా సముద్ర మట్టాల పెరుగుదలకే దారితీస్తుంది" అని నేపాల్ విదేశాంగ మంత్రి షిషిర్ ఖనాల్ వ్యాఖ్యానించారు. హిమాలయ పర్వత శ్రేణులు ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం భారత్, నేపాల్‌తో పాటు చైనా, భూటాన్‌లకు కూడా ఉమ్మడి ముప్పు అని ఆయన హెచ్చరించారు. ఖాట్మండులో గురువారం నిర్వహించిన 'వరల్డ్ అన్విక్షా సమ్మిట్'లో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. నేపాల్-చైనా సరిహద్దులో ఆకస్మిక వరదలు సంభవించి దిగువ ప్రాంతాలు జలమయమైన ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. హిమాలయాల్లో మంచు కరుగుతున్న తీరుకు ఈ వరదలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వరదల ప్రభావం భారత సరిహద్దు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్‌లపై తక్కువగా ఉన్నప్పటికీ, గతంలో ఇటువంటి ఘటనలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని, భవిష్యత్తులోనూ ఇటువంటి ముప్పు పొంచి ఉందని ఆయన గుర్తుచేశారు. భారత్, నేపాల్ దేశాల మధ్య 'రోటీ-బేటీ', 'సీతా-రామ్' వంటి చారిత్రక, సాంస్కృతిక బంధాలే కాకుండా, పర్యావరణ కోణంలోనూ ద్వైపాక్షిక సంబంధాలను పునర్నిర్వచించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. "రాజకీయ వైరుధ్యాలు ఉండవచ్చు, కానీ వాతావరణ మార్పుల కారణంగా ప్రమాదంలో పడిన హిమాలయ ప్రాంతాన్ని సంరక్షించుకోవడానికి మనమంతా సమైక్యంగా కృషి చేయాలి" అని ఆయన సూచించారు. హిమాలయాల్లోని మంచినీటి వనరులపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 200 కోట్ల మంది ప్రజలు భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని, ఇది యావత్ మానవ నాగరికతకే పెను ముప్పుగా పరిణమించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి భూపేష్ సుబ్బరామిరెడ్డి

## కూటమి ప్రభుత్వం రెండేళ్ల సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించిన టీడీపీ నాయకులు



కడప జిల్లా/జమ్మలమడుగు మహి న్యూస్, ఆగస్టు 27: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పెద్దపసుపల మోటు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీచర్స్ కాలనీలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం పార్టీ" కార్యక్రమంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను తెలియజేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంబాపురం రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మల్లికార్జున, క్లస్టర్ బాల పుల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, గౌస్ పీర్, శంకర్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కడప కారాగారాల్లో ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల తనిఖీ

## ఖైదీల కేసులు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా -- ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన





కడప, మహి న్యూస్, ఆగస్టు 27: కడప పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలోని ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ గురువారం సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్ సూచనల మేరకు ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడిన సీనియర్ సివిల్ జడ్జి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఖైదీలు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. లీగల్ ఎయిడ్ బాక్సులను పరిశీలించారు. జైళ్లలో ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి సకాలంలో మందులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు వైద్యాధికారికి తగు సూచనలు చేశారు. అదేవిధంగా లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై ఖైదీలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారం సూపరింటెండెంట్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.




# వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాళీఘాట్ కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాళీమాతను ప్రార్థించిన డి.వి. శశికాంత్ రెడ్డి

కడప జిల్లా/పులివెందుల మహి న్యూస్ । ఆగష్టు 27: కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డి.వి. శశికాంత్ రెడ్డి కోల్‌కతాలోని ప్రసిద్ధ కాళీఘాట్ కాళీమాత ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శశికాంత్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వైఎస్ అవినాష్ రెడ్డికి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేసే శక్తి, సామర్థ్యాలను అమ్మవారు ప్రసాదించాలని ప్రార్థించారు. భవిష్యత్తులో అవినాష్ రెడ్డి మరెన్నో ఉన్నత పదవులు, బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరుతూ కాళీమాత ఆశీస్సులు తీసుకున్నారు. అవినాష్ రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల ద్వారా ఆయనకు అమ్మవారి కృప, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని శశికాంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# తొండూరు బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన



పులివెందుల /తొండూరు మహి న్యూస్ ఆగష్టు 27: తొండూరు ఎస్ఐ శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పోలీసు సిబ్బంది సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, విద్య ప్రాముఖ్యతను గుర్తించి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మాదకద్రవ్యాలకు 'నో' చెప్పాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112తో పాటు ఇతర ఎమర్జెన్సీ నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హాస్టల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మనం ఆధునిక సమాజంలో ఉన్నామా? ప్రాచీన సమాజంలోనా

కె.జీవానందం, రాష్ట్ర కన్వీనర్, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక



గాలివీడు:ఆగష్టు27(మహి న్యూస్) : మనం 5+ లో ఉన్నాం, చంద్రమండలంపై చంద్రయాన్ దింపాం, డిజిటల్ ఇండియా అంటున్నాం. కానీ క్రిందకు చూస్తే మన సమాజం ఇంకా ప్రాచీన శిలాయుగంలోనే ఉందనిపిస్తుంది. ఎందుకంటే మనిషిని మనిషిగా చూడని వివక్ష ఇంకా అలాగే ఉంది. ఈ దేశంలో అసమానతలు ఎలా ఉన్నాయో చూడండి 1. ఆర్థిక అసమానత ఒకవైపు అదానీ లాంటి వారి ఆదాయం రోజుకు వందల కోట్లలో పెరుగుతుంటే, అదే దేశంలో కోట్లాది వలస కూలీలు, వడ్డెరలు, రోజు కూలీలు రెండు పూటలా తిండి లేక అలమటిస్తున్నారు. ఒకడికి తిన్నది అరగక జిమ్ కు వెళితే, ఇంకొకడు తినడానికి లేక నకనకలాడుతున్నాడు. ఇదేనా అభివృద్ధి? 2. సామాజిక, రాజకీయ అసమానత: రాజ్యాంగం అందరికీ సమాన హక్కు ఇచ్చింది. కానీ 175 అసెంబ్లీ సీట్లలో డబ్బున్నోడు, అగ్రకులాల వారే 85% ఆక్రమించారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు, 7 కోట్లు ఉన్న డి-నోటిఫైడ్ తెగలకు అసెంబ్లీలో 0 సీటు. రిజర్వేషన్ ఉన్న ూజ, ూ లకు కూడా నామమాత్రపు అధికారమే. రాజ్యాధికారం అనేది ఇంకా కొన్ని కుటుంబాల సొత్తుగానే ఉంది. 3. విద్య, ఉద్యోగంలో అసమానత: ఒకరి పిల్లలు లండన్ లో చదువుకుంటే, మన బిడ్డలు ప్రభుత్వ బడిలో టీచర్ లేక, బల్ల లేక నేలమీద కూర్చుంటున్నారు. ఉద్యోగాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పేరుతో ఊడ్చేశారు. ఉన్నోడి పిల్లలకు కార్పొరేట్ ఉద్యోగం, లేనోడి పిల్లలకు మళ్లీ అదే రాయి కొట్టే పని, భవన నిర్మాణ కూలీ పని 4. ఆత్మగౌరవంలో అసమానత: ఇదే అత్యంత ప్రమాదం. ఉన్నోడు తప్పు చేసినా గౌరవించబడుతున్నాడు. లేనోడు నిజాయితీగా బతికినా అనుమానించబడుతున్నాడు. నిన్నటి వరకు మమ్మల్ని 'నేరస్థ తెగలు' అన్నారు. నేడు 'అసమర్థులు' అంటున్నారు. ముద్ర మారింది కానీ వివక్ష అలాగే ఉంది. వీటన్నింటిని బట్టి చూస్తే నిజంగా ఈ దేశంలో వందల కులాలు లేవు. ఉన్నది రెండే కులాలు. ఒకటి - ఉన్నోడి కులం - అధికారం, సంపద, విద్య, గౌరవం అన్నీ ఉన్న కులం. రెండు - లేనోడి కులం - ఏమీ లేని, అన్నీ కోల్పోయిన కులం. అందుకే ఈ ఆధునిక యుగంలో కూడా మనం ప్రాచీన బానిస సమాజంలోనే బతుకుతున్నామనిపిస్తుంది. యజమాని మారాడు, బానిసత్వం రూపం మారింది అంతే.

### పరిష్కారం ఏమిటి?

ఈ రెండు కులాల మధ్య అంతరాన్ని పూడ్చాలంటే ఒకే ఒక మార్గం - జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో వాటా. విద్యలో, ఉద్యోగంలో, రాజకీయంలో, బడ్జెట్ లో. ఉన్నోడి నుంచి లేనోడికి అధికారాన్ని బదిలీ చేయడమే నిజమైన స్వాతంత్ర్యం. లేకపోతే మనం ఎన్ని శాటిలైట్లు పంపినా, మన సమాజం మాత్రం ఇంకా చీకటి యుగంలోనే ఉంటుంది.

# పోలింగ్ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఎస్ఐఆర్ స్పెషల్ అబ్జర్వర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు




మదనపల్లె, ఆగస్టు 27 (మహి న్యూస్): తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితాను పటిష్టంగా రూపొందించాలని జిల్లా ఎస్ఐఆర్ స్పెషల్ అబ్జర్వర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన నిమిత్తం గురువారం మదనపల్లెకు విచ్చేసిన ఎస్ఐఆర్ స్పెషల్ అబ్జర్వర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పట్టణంలోని జిఆర్టి హైస్కూల్, పప్పిరెడ్డిపల్లి పురపాలక ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న 16/164, 89/164, 93/164 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల ను పరిశీలించిన ఆయన, ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు తదితర వివరాలకు సంబంధించిన ఫారాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధికి చెందిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఒకే ఇంటి నంబర్‌కు అధిక సంఖ్యలో ఓటర్లు నమోదై ఉన్నారా, ఫొటోలు లేని ఓటర్ల వివరాలు ఉన్నాయా వంటి అంశాలను పరిశీలించి, అటువంటి వివరాలను మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలనతో పాటు పోలింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లు, ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా జాబితాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని అధికారులకు స్పష్టం చేశారు.బ పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ అనంతరం మదనపల్లె త్యాగరాజు వీధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)ను ఎస్ఐఆర్ స్పెషల్ అబ్జర్వర్ మరియు సెకండరీ హెల్త్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోజువారీ ఓపీ, ఐపీ సేవలు, ల్యాబొరేటరీ పరీక్షలు, రోగుల అడ్మిషన్లు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సిబ్బందిని ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశంపై కూడా ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డిఎంహెచ్వో డా. శ్రీనివాసులు, డిసిహెచ్ఎస్ లక్ష్మీప్రసాద్, రెవెన్యూ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి నారా లోకేష్‌కు రాఖీలు కట్టిన మంగళగిరి మహిళలు



**మంగళగిరి, మహి న్యూస్, ఆగస్టు 27 : రాఖీ పండుగను పురస్కరించుకుని మంగళగిరికి చెందిన పలువురు మహిళలు, స్థానిక టీడీపీ మహిళా నేతలు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. గురువారం మంగళగిరి మోడరన్ రైతు బజార్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి లోకేష్‌ను కలిసి మహిళలు రాఖీలు కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.**

# చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి, మహి న్యూస్, ఆగష్టు 27 : పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వారిగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

# పరిగి మున్సిపాలిటీలో ఎస్ ఐ ఆర్ వార్డు సభలు!




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా పై వార్డు సభలు నిర్వహించారు. పరిగి మున్సిపల్ పరిధిలోని , 12, 13, 16, 17,18 వార్డు లలో జరిగిన సభలలో పురపాలక చైర్ పర్సన్ రజిత వెంకటేష్ పాల్గొని ఓటర్ల అభ్యంతరాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఓటరు తమ ఓటును సరిచూసుకోవాలని, తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమన్నారు. ఈ కార్యక్రమంలో పి ఎ సి ఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యుబ్, పి ఎ సి ఎస్ డైరెక్టర్ చిన్న నర్సిములు , కో-ఆప్షన్ సభ్యులు ఆనేం ఆంజనేయులు, పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, నాయకులు రాజేందర్,గణేష్ సర్వర్, అఫ్రోజ్, అబ్దుల్ అజ్గర్, తదితరులు పాల్గొన్నారు.

# 8వ వార్డులో ఎస్ ఐ ఆర్ పై వార్డు సభ



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్ హబీబున్నిసా అయ్యూబ్ ఆధ్వర్యంలో వార్డులో ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ హబీబున్నిసా అయ్యూబ్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. వార్డులో ని ప్రజలు ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సహకరించి, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గుండెల రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, అంజి మహమ్మద్ ముస్తఫా, మహబూబ్, కాశీఫ్, ముజామిల్, నాసిర్ బి ఎల్ ఓ సుప్రీన్వై అషు బేగం, సేవియా, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి మండలంలోని పలు గ్రామాలలో ఎస్ ఐ ఆర్ పై గ్రామ సభలలో పాల్గొన్న

**మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు. మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు 27వ తేదీన పరిగి మండల పరిధిలోని గడిసింగాపురం నారాయణపూర్ రంగంపల్లి రూప్ ఖాన్ పేట్, పేట మాదారం తదితర గ్రామసభలలో పాల్గొని ఎస్ ఐ ఆర్ పై పూర్తి సమాచారం తెలుసుకున్నారు**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):- పరిగి మండల పరిధిలోని పలు గ్రామాలలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు పాల్గొన్నారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. వార్డులో ని ప్రజలు ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సహకరించి, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



# రామలక్ష్మణుల ఆలయ ప్రారంభోత్సవం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి టి రామ్మోహన్ రెడ్డి!



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పూడూరు మండలం రాకంచెర్ల గ్రామంలో రామలక్ష్మణుల గుడి ప్రారంభోత్సవం మరియు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు,ప్రజా ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాకంచెర్లలో ఎస్ ఐ ఆర్ గ్రామ సభ... పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి.



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పూడూరు మండలం రాకంచెర్ల గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=)లో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ,స్థానిక నాయకులతో కలిసి ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని,ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

## దీబగుంట్ల సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్

నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 27: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం దీబగుంట్ల గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, ఆధార్ సేవలు, సర్--2026, ఆధార్ లేని పిల్లల నమోదు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, పరిపాలనాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు ఆధార్ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధార్ లేని పిల్లల నమోదు ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సంబంధిత దరఖాస్తులను పరిశీలించి, సాంకేతిక లేదా ఇతర సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సర్--2026 ప్రక్రియ గురించి సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సచివాలయంలోని వివిధ రికార్డులను, ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. లిప్రజల నుంచి స్వీకరించే అర్జీలు, దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. లిఅర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, వారికి పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## "వన్ మంత్ - ఫోర్ విజిట్"
## కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 27 : జిల్లా పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28 వ తేదీన నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడు, కొత్తపల్లె మండలాలకు సంబంధించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పాములపాడు, కొత్తపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు.

## రీ--సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి
## పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 27 : జిల్లాలో రీ--సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు




22-ఏ జాబితా సవరణలు, రీ సర్వే, డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాల (పీపీబీ) పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, మ్యుటేషన్, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఆర్టీవోలు, తాసిల్దారులు, సర్వే అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీ--సర్వే, ఫోర్టింగ్‌కు సంబంధించిన పెండింగ్ పనులు, 5వ విడత రీ--సర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్ (జీటీ), డీఎల్ఆర్ పనుల పురోగతి తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. రీ--సర్వే, సంబంధించిన పెండింగ్ పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ పనులను గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 5వ విడత రీ--సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ (జీటీ) పనులను ఆగస్టు 31 నాటికి పూర్తి స్థాయిలో ముగించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. నిలిచిపోయిన డీఎల్ఆర్ పనులన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫెక్టెడ్ గ్రామాల్లో రీ--సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు తహశీల్దార్లు, మండల సర్వేయర్లకు వర్చువల్ విధానంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రీ--సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సాంకేతిక అంశాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రీ--సర్వే ప్రక్రియలో అధికారులు, సిబ్బందికి ఏవైనా సమస్యలు లేదా సందేహాలు ఉంటే వాటిని పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా కలిసి స్పష్టత తీసుకోవాలని అన్నారు. మండల స్థాయి నుంచే రీ--సర్వే ప్రక్రియను మరింత సులభతరం (స్ట్రీమ్లైన్) చేసి, నివేదికలు, ఫైళ్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత డైరెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్‌కు త్వరితగతిన పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
రీ--సర్వే ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు..

# ఇద్దరు ఇంటి కన్నం దొంగలు అరెస్ట్

### 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి నగలు స్వాధీనం
### నేరానికి ఉపయోగించిన క్వాలిస్ వాహనం సీజ్
### సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ డేటా ఆధారంగా నిందితుల గుర్తింపు
### నిందితులపై 10కి పైగా దొంగతనం కేసులు





కర్నూలు, ఆగస్టు 27: (మహి న్యూస్) : కర్నూలు నగరంలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకోవడంతో పాటు, నేరానికి ఉపయోగించిన క్వాలిస్ వాహనాన్ని సీజ్ చేశారు. కర్నూలు నగరంలోని హోసన్న మందిర్ సమీపంలోని శ్రీనివాసనగర్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సమీపంలో నివాసముంటున్న సెకండ్ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ మహేష్ ఇంట్లో, ఆయన పక్కనే నివాసముంటున్న రిటైర్డ్ ఆర్ఎస్ఐ సుబ్బయ్య ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి బీరువాలను ధ్వంసం చేసి బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సీఐ విక్రమ్ సింహ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది సుబ్బారాయుడు, మురళి, శ్రీనివాసులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు ఇతర సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో చోరీలకు పాల్పడిన వారు హైదరాబాద్‌కు చెందిన సర్ఫరాజ్, ఖుర్రం అలీ, షనవాజ్‌లుగా గుర్తించారు. అనంతరం వారి ఫోన్ డేటాను సేకరించి నిఘా ఏర్పాటు చేశారు. నిందితుల కదలికలు కర్నూలు ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించిన ప్రత్యేక బృందం వారిని అదుపులోకి తీసుకుని విచారించింది. విచారణలో ముగ్గురు నిందితులు ఆదివారం కర్నూలుకు వచ్చి నగర శివారు ప్రాంతాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, తాళాలు పగలగొట్టి రెండు ఇళ్లలో చోరీ చేసినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలను విక్రయించి బెంగళూరుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన క్వాలిస్ వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై సిద్దిపేట, అడ్డాకల్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే 10కి పైగా దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# బుధవారపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు

### బహిరంగంగా మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా









కర్నూలు, ఆగస్టు 27 (మహి న్యూస్): కర్నూలు నగరంలోని బుధవారపేట ప్రాంతంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు త్రీ టౌన్ ఎస్సై సమీర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచుతూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వినియోగించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఓర్వకల్లువిధి నిర్వహణలో నిద్రిస్తూ ఉన్న ఎలిమెంట్ స్కూల్ హెచ్ఎం




పాఠశాలలోనే నిద్రిస్తున్నారంటూ వీడియో వైరల్.. విద్యాశాఖ అధికారుల చర్యలపై సర్వత్రా చర్చ ఉన్న

ఓర్వకల్లు ఆగస్టు 27 (మహిన్యూస్) : కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల కేంద్రం లో విద్యార్థులకు,విద్యాబుద్ధులు నేర్పి, వారికి ఆదర్శంగా నిలవాల్సిన ఓ ప్రభుత్వ పాఠశాలప్రధానోపాధ్యాయుడి పై విధి నిర్వహణలో నిద్రిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అక్కడ ఉన్న విద్యార్థులను అడిగి తెలుసుకోగా స్కూలుకు వచ్చిన ప్రతిరోజు ఇలాగనే హెచ్ఎం నిద్రిస్తూనే ఉంటాడని విద్యార్థులు తెలపడం జరిగింది , విధిసమయంలో హెచ్ఎం నిద్రిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో స్థానికంగా కలకలం రేగింది. గురువును సమాజంలో ఎంతో గౌరవప్రదమైన స్థానంలో చూస్తారు. అలాంటి,బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు విధి సమయంలో నిద్రిస్తున్నట్లు కనిపించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నిర్వహణతో పాటు విద్యార్థుల క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన హెచ్ఎం ఇలా వ్యవహరిస్తే మిగతా ఉపాధ్యాయులపై కూడా ప్రభావం పడుతుందని పలువురు,వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి మద్యం సేవించిన విషయం అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.ఎంఈఓతో పాటు ఉన్నతాధికారులు స్పందించి, ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అధికారులు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివి మరల జరగకుండా చూడవలసిందిగా విద్యాశాఖ అధికారులకు ఓర్వకల్లు గ్రామ ప్రజలు అధికారులని వేడుకుంటున్నారు

## రెవెన్యూ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

నంద్యాల, మహి న్యూస్, ఆగస్టు 27: 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రెవెన్యూ ఆర్జించే శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, బకాయిల వసూళ్లు, శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గురువారం సాయంత్రం గంటలకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శాఖకు నిర్దేశించిన త్రైమాసిక రెవెన్యూ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలను శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. రెవెన్యూ బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత లక్ష్యాలను సాధించేలా అధికారులు సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

శాఖల మధ్య సమన్వయం ద్వారా రెవెన్యూ వసూళ్లను మరింత మెరుగుపరచాలని, అమలు ప్రక్రియలో ఎదురయ్యే అంతరశాఖ సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర లక్ష్యాల సాధనకు స్పష్టమైన కార్యాచరణ వ్యూహంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు తమ శాఖలకు సంబంధించిన త్రైమాసిక రెవెన్యూ లక్ష్యాలు, సాధించిన ప్రగతి, బకాయిల వసూళ్ల పరిస్థితి, అంతర్ శాఖ సమన్వయ సమస్యలు, ప్రస్తుత సంవత్సర లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమీక్ష సమావేశానికి కమర్షియల్ ట్యాక్స్, పోలీస్, మైన్స్ అండ్ జియాలజీ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ట్రెజరీ అండ్ అకౌంట్స్, లీగల్ మెట్రాలజీ, రిజిస్ట్రేషన్, విద్య, రవాణా, ప్రజా రవాణా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలకు చెందిన అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గుమ్మనూరు కుటుంబ సభ్యుల మధ్యన జరిగిన
## గుమ్మనూరు విద్యా హల్దివేడుకల్లో పాల్గొన్నగుమ్మనూరు నారాయణ...



గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య వివాహం అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కుమారుడు శివరాజ్ తో ఈనెల 30వ తేదీన నిశ్చయించడం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మనూరు వారి వివాహ వేడుకలలో భాగంగా రెండవ రోజు హల్ది కార్యక్రమంలో పాల్గొన్న ఆలూరు నియోజకవర్గం బిజెపి బి ఎల్ ఓ 1 గుమ్మనూరు నారాయణ ఈ కార్యక్రమంలో గుమ్మనూరు నారాయణ అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYALCHECKPOST, KURNOOL-518001, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email :mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com